క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కి పితృవియోగం



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని గాదంకి పంచాయతీ మాజీ సర్పంచ్ చొక్కలింగం తండ్రి నరసింహులు(75) కన్నుమూశారు. సోమవారం గాదంకి గ్రామానికి వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజక వర్గం సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెళ్లి నరసింహులు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.

అర్ధరాత్రి పూజల కలకలం



పూజలు చేస్తున్న వారిని హెచ్చరిస్తున్న పోలీసు

చంద్రగిరి : మండలంలోని మల్లయ్యపల్లె సమీపంలో ఉన్న ధనేశ్వరమ్మ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి కొందరు పూజలు నిర్వహించడం స్థానికంగా కలకలం రేపింది. ఆలయంలోని రాత్రివేళ అరుపులు, కేకలు వినిపించడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని పూజలు చేస్తున్న వారిని విచారించారు. తమ కుటుంబీకులకు ఆరోగ్యం సరిగా లేదని, ఈ సమయంలో అమ్మవారిని పూజిస్తే నయమవుతుందనే విశ్వాసంతో వచ్చినట్లు తెలిపారు. అయితే అర్ధరాత్రి వేళ ఎలాంటి అనుమతులు లేకుండా ఆలయంలోకి ప్రవేశించి పూజలు చేయడం సరికాదని, ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించి వారిని పంపేశారు.

'పీఎం కిసాన్'పై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ సుబ్బారావు

తిరుపతి రూరల్ : మండలంలోని సి.గొల్లపల్లె సచివాలయంలో సోమవారం రైతులకు పీఎం కిసాన్ పథకంపై వ్యవసాయశాఖాధికారి సుబ్బారావు అవగాహన కల్పించారు. ఈ పథకం కింద నగదు జమ కాని లబ్ధిదారులుంటే వివరాలు అందించాలని కోరారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం అర్హులైన రైతులకు రూ.2వేల చొప్పున ఏడాదికి మూడు విడతల్లో రూ.6వేలు జమ చేస్తుందని వివరించారు.

శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి



వరాహస్వామివారి ఆలయం

తిరుమల : తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం వరాహ జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ మూలమూర్తికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో విశేష అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్రతాప్‌స్వామి ఆధ్వర్యంలో సోమవారం తాతానగర్‌లోని నేరేళ్లమ్మ ఆలయం వద్ద ప్రజలకు ఉచితంగా 500 మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రతాప్ స్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం చవితి వేడుకల్లో ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి , హనుమంతరావు, కేఎస్ రాజా, ధనంజయరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి సురేష్ స్వామి పాల్గొన్నారు.

కపిలేశ్వరాలయంలో చవితి వేడుకలు రేపు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు సాయంత్రం 5.30 గంటలకు మూషిక వాహనంపై గణేశుని కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపించనున్నారు. అలాగే తిరుమల రెండో ఘాట్‌రోడ్డులోని గణపతి ఆలయంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విశేషాభిషేకం చేపట్టనున్నారు.

శిథిల భవనం.. స్వాహాకు సిద్ధం

వినియోగంలేని ఆస్తి కనపడితే చాలు.. కబళించేందుకు కూటమి నేతలు సన్నద్ధమవుతున్నారు. ఖాళీ జాగా కంట పడితే చాలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే రామచంద్రాపురంలో శిథిలావస్థకు చేరిన వ్యవసాయ కార్యాలయ భవనంపై అధికార పార్టీ నాయకుడు కన్నేశాడు. ఆవరణలోని స్థలాన్ని విడతలవారీగా కాజేసేందుకు రంగంలోకి దిగాడు. ఈ కేంద్రంలో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహించకపోవడంతో ఇదే అదునుగా ఆక్రమించుకునేందుకు అడుగులు వేస్తున్నాడు.

కూలేందుకు సిద్ధంగా వ్యవసాయ శాఖ కార్యాలయం



- వ్యవసాయశాఖ కార్యాలయ స్థలంపై కూటమి నేత కన్ను
- దశలవారీగా ఆక్రమణకు యత్నం
- ఆవేదనలో రైతాంగం

రామచంద్రాపురం : మండల కేంద్రంలో వ్యవసాయశాఖ కార్యాలయానికి సుమారు 40 ఏళ్ల క్రితం భవనం నిర్మించారు. వందలాది మంది రైతులు ఈ కేంద్రంలో సాగుకు సంబంధించిన సలహాలు పొందేవారు. అవసరమైన ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసుకునేవారు. అయితే కాల క్రమంలో ఆ భవనం కాస్తా శిథిలావస్థకు చేరింది. దీంతో సిబ్బంది అందులో విధులు నిర్వర్తించేందుకు ఆందోళన చెందేవారు. దీంతో అధికారులు స్పందించి ఆ కార్యాలయం ఖాళీ చేయించారు.

సి.రామాపురానికి తరలింపు

రామచంద్రాపురంలోని వ్యవసాయశాఖ కార్యాలయాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సి.రామాపురంలో ఉన్న ఓ భవనంలోకి మార్పు చేశారు. పాత స్థలంలో నూతన భవనం నిర్మించి మళ్లీ అక్కడికే ఆఫీసును తరలించాలని భావించారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే సి.రామాపురం నుంచి గంగిరెడ్డిపల్లె పంచాయతీలోని రైతు భరోసా కేంద్రానికి వ్యవసాయశాఖ కార్యాలయం మార్చేశారు. దీనిపై మండలంలోని పలు గ్రామాల రైతులు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులకు సైతం పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు!

ఈ క్రమంలో ఆర్‌సీపురంలోని వ్యవసాయశాఖ కార్యాలయ స్థలంపై కూటమికి చెందిన స్థానిక నేత కన్నేశారు. ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు అన్నట్లు క్రమక్రమంగా స్థలం ఆక్రమించుకుంటూ వస్తున్నారు. ఆయన కబ్జాలపై సొంత పార్టీ నేతలే ఆరోపణలు గుప్పిస్తుండడం గమనార్హం. ఈ మేరకు మండలంలోని రైతులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండ కేంద్రంలో ఉండాల్సిన వ్యవసాయశాఖ కార్యాలయాన్ని వేరే పంచాయతీలో ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. శిథిల భవనం స్థానంలో కొత్త కట్టడం నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు స్పందించాలని, కబ్జాలను అరికట్టడమే కాకుండా, రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు.

నోటీస్ బోర్డు

- స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా ఉదయం 8 గంటలకు బైరాగిపట్టెడలోని బాబూ జగజ్జీవన్‌రామ్ పార్కు నుంచి రామానాయుడు స్కూల్ వరకు అవగాహన ర్యాలీ.
- తారకరామా స్టేడియం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 9 గంటల నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు.
- అలిపిరిలోని హోమ మండపంలో నిర్వహించే శ్రీనివాస దివ్య హోమానికి సంబంధించిన టికెట్లు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల.

మాతృశాఖకు అదనపు కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి మాతృశాఖకు వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆడిట్ విభాగం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఆయనను మాతృ శాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ అదనపు కమిషనర్‌గా మరొకరిని నియమించకపోవడంతో కమిషనర్ మౌర్య రిలీవ్ చేయలేదు. సోమవారం ఈ మేరకు మంత్రి నారాయణను కలిసేందుకు వచ్చిన చరణ్‌తేజ్‌రెడ్డిని నువ్వు ఇంకా రిలీవ్ కాలేదా అని మంత్రి ప్రశ్నించారు. అనంతరం మంత్రి ఆదేశాలతో కమిషనర్ మౌర్య స్పందించారు. చరణ్‌తేజ్ రెడ్డిని రిలీవ్ చేస్తూ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారు. అదనపు కమిషనర్ ఇన్‌చార్జి బాధ్యతలను డిప్యూటీ కమిషనర్ అమరయ్యకు అప్పగించారు.

శుభకార్యానికి వెళ్లి ఆశీస్సులు



అభినందనలు తెలుపుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని నేంద్రగుంట శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ పంటపల్లి పంచాయతీ కన్వీనర్ అన్నే దాము కుమార్తె నిశ్చితార్థ వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై కాబోయే దంపతులు సుస్మిత, గోపీకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, హరిప్రసాద్‌డ్డి, నంగా కపిలీశ్వర్‌రెడ్డి, గోపి, రెడ్డెప్పరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఋకేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్యామల, రాజేష్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు వినతి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

తిరుపతి రూరల్ : ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తరఫున వినతిపత్రం అందించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పరిస్థితి అద్దం పట్టే ఫొటోలను కలెక్టర్‌కు చూపించారు. తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు కోతపెట్టినప్పటికీ, ఇప్పటి వరకు వసతుల కల్పనకు ఖర్చుపెట్టిన దాఖలాలు లేవని ఆరోపించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు నిత్యం వాటర్ క్యాన్లను మోసుకుని వెళ్లే దుస్థితి దాపురించిందని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుల్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి, మండలాల అధ్యక్షులు గూడూరు రఫీ, యశ్వంత్ రెడ్డి, హరీష్, చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, నరేశ్, ప్రదీప్ కుమార్, శేషారెడ్డి పాల్గొన్నారు.

'మలబార్'లో రత్నాభరణాల ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన సరికొత్త రత్నాభరణాల ప్రదర్శనను కస్టమర్లతో సోమవారం ఘనంగా ప్రారంభించారు. షోరూమ్ హెడ్ రెజిష్ మాట్లాడుతూ మహిళల వ్యక్తిత్వం, అంతర్గత బలం, స్వీయవ్యక్తీకరణకు ప్రతీకగా నిలిచే ఈప్రదర్శన సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో 18 నుంచి 22 క్యారట్ల బంగారంలో వజ్రాల మెరుపుతో, వర్ణ రంజిత రత్నాలతో రూపొందించిన డిజైన్లు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని వెల్లడించారు. జెమ్స్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్‌లో భాగంగా ×వ్యానశితో పాటు అన్‌కట్ వజ్రాలు, విలువైన రత్నాలతో చేసిన సంప్రదాయ ఆభరణాలను కూడా ప్రదర్శిస్తున్నామని వివరించారు. అన్ని రకాల రత్నాభరణాలు, అన్‌కట్ వజ్రాలపై మేకింగ్ చార్జీల్లో 25 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ఆఫర్ కల్పించామని తెలిపారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న కస్టమర్లు

కొడిగడుతున్న 'దీపం'

తిరుపతి అర్బన్ : ఎన్నికల సమయంలో ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో మెలికలు పెట్టి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. సూపర్‌సిక్స్ హామీల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదనే విమర్శలున్నాయి. ఇప్పుడు అదే బాటలో దీపం పథకం కింద అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ హామీ కూడా చేరింది.

తగ్గిపోతున్న లబ్ధిదారులు

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి సర్కార్ చెప్పిన విషయం తెలిసిందే. జిల్లాలో 4,20,765 గ్యాస్ కనెక్షలు ఉన్నాయి. అయితే అడ్డగోలు నిబంధనలతో అర్హుల సంఖ్యను తగ్గించారు. గత ఏడాది డిసెంబర్-మార్చి వరకు మొదటి విడత సిలిండర్లు బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మొదటి విడతలో 3,87,091 మంది మాత్రమే బుక్ చేసుకున్నారు. ఒక్క సిలిండర్‌కు రూ.831 చొప్పున బ్యాంక్ ఖాతాల్లో అర్హులైన వారికి జమ చేయాల్సి ఉంది. ఆ మేరకు రూ.31.06 కోట్లు జమ చేశారు. రెండో సిలిండర్‌ను ఏప్రిల్-జూలై వరకు బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తే 3,63,297 మంది మాత్రమే పొందారు. వారి ఖాతాల్లోకి రూ.26.75 కోట్లు మాత్రమే జమ చేశారు. ఆగస్టు 1 నుంచి-నవంబర్ వరకు మూడో సిలిండర్ బుక్ చేసుకోవడానికి వీలుంది. ఈ సంఖ్య తగ్గుతుందో లేదా పెరుగుతుందో వేచి చూడాల్సి ఉంది. మొదటి విడత సిలిండర్‌కు రెండో విడత సిలిండర్‌కు తేడా చూస్తే 23,794 మందికి తగ్గింది. మూడో విడతకు సంబంధించి ఇప్పటి వరకు 78 మంది మాత్రమే బుక్ చేసుకున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.



పలు ఆలయాల్లో పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా వెలసిన మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి గుడిలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది.అలాగే పరాశరేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 4 నుంచి 6వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరిపించనున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే వైఎస్సార్ జిల్లా దేవుని కడపలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సైతం సెప్టెంబరు 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

భవనం కూల్చివేతపై పునరాలోచిస్తాం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం భవనం కూల్చివేతపై పునరాలోచిస్తామని, కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ప్రజా ప్రతినిధులు, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హథీరాంజీ మఠం భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. పునరాలోచించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్మిస్తామని వెల్లడించారు. సమావేశంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ బోర్డు చైర్మన్ సుగుణమ్మ, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, మఠం ఏఓ బాపిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన క్యూ ఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డులను సోమవారం ఎన్‌జీఓ కాలనీలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. తిరుపతిలో 66,243 మందికి కార్డులు అందించనున్నట్లు తెలిపారు. డీఎస్‌ఓ రాజు, తహసీల్దార్ సురేష్ కుమార్, నేతలు ఊకా విజయ్ కుమార్, కుమారమ్మ, డిప్యూటీ మేయర్ మునికృష్ణ పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి మండలం పనపాకంలో తహసీల్దార్ శివ రామసుబ్బయ్య స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరత్నం పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

మండలానికి మొత్తం 9,611 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని తహసీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు.

తిరుపతి రూరల్‌లో..

మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, డీలర్లతో తహసీల్దార్ రామాంజులు నాయక్ సమావేశం నిర్వహించారు. అనంతరం మల్లంగుంటలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.



కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

భౌబోయ్!

వీధి కుక్కల దాడిలో వేలాది మంది గాయపడుతున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో సంచరించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో పిల్లలు సైతం శునకాల కాటుకు గురవుతున్నారు. ఇటీవల సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించడంతో గ్రామ సింహాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. వీధి కుక్కల స్వైరవిహారాన్ని కట్టడి చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

- పెరిగిన కుక్క కాటు బాధితులు
- పిక్కలు పీకేస్తున్న శునకాలు
- నగరంలో ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న వీధి కుక్కలు





తిరుపతి తుడా : జిల్లాలో వీధి కుక్కల బెడద అధికమైంది. అదే స్థాయి లో కుక్కకాటుకు గురవుతున్న బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, రేబిస్ వ్యాక్సినేషన్ పూర్తిస్థాయిలో అమలు రావడం లేదు. దీంతో ఇది శునకాల సంతతి పెరిగిపోతోంది. కుక్క కాటుకు గురైతే రోజుల తరబడి ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. వీధి శునకాల నియంత్రణకు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రజలు భయం భయంగా కాలం గడుపుతున్నారు.

సుప్రీం ఆగ్రహం

వీధి కుక్కల బెడదపై ఇటీవల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వీటి నియంత్రణకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇదే తరుణంలో పలు ప్రాంతాల్లో చిన్నపిల్లలపై వీధి కుక్కలు చేసిన దాడి ఘటనలు సంచలనంగా మారాయి. వీటికి తోడు పాత వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

చర్యలు శూన్యం

జిల్లా వ్యాప్తంగా డాగ్ బైట్స్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఆశించిన స్థాయిలో కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేపట్టడం లేదు. దీంతో గ్రామాలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా వీధి కుక్కలు పెరిగిపోయాయి.

ఆందోళనలో జనం

ఉదయం, సాయంత్రం, రాత్రి తేడా లేకుండా ఒంటరిగా వీధుల్లోకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను బయట పంపించేందుకు సాహసం చేయడం లేదు. పిల్లలు ఒంటరిగా కనిపిస్తే వీధి కుక్కలు దాడులకు తెగబడుతున్నాయి. అదే స్థాయిలో వాహనదారులను పరుగులు పెట్టిస్తున్నాయి.

జిల్లాలో కుక్క కాటు కేసుల సమాచారం

జనవరి	:	1,690
ఫిబ్రవరి	:	1,843
మార్చి	:	1,794
ఏప్రిల్	:	1,713
మే	:	1,802
జూన్	:	1,698
జూలై	:	1,770
ఆగస్టు	:	1,580

రోడ్డుపై సైకిళ్లు.. ట్రాఫిక్ ఇక్కట్లు!



జీవకోన, రాజీవ్‌గాంధీకాలనీ వెళ్లేందుకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఉదయం 7నుంచి 9గంటలు, సాయంత్రం 4నుంచి 6 గంటల నడుమ రాకపోకలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు, వ్యానులు, ఆటోలతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనికితోడు రాఘవేంద్రనగర్ సర్కిల్ వద్ద ఓ ప్రైవేటు స్కూల్ ఎదుట విద్యార్థులు నడిరోడ్డుపై సైకిళ్లను పార్క్ చేయడంతో మరింత అంతరాయం ఏర్పడుతోంది. పాఠశాలలకు పార్కింగ్ లేకపోవడంతో పిల్లలకు ప్రత్యామ్నాయం లేని పరిస్థితి తలెత్తుతోంది. జీవలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేసినప్పటికీ ట్రాఫిక్ సమస్య కొనసాగుతూనే ఉంది. - తిరుపతి మంగళం